క్లుప్తంగా

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ కష్టాలు



సామర్లకోట ఫ్లై ఓవర్‌పై నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్ సుమారు 50 ఏళ్ల క్రితం సింగిల్ రోడ్డుగా ఏర్పడడం.. వాహనాల రద్దీకి తగ్గట్టు మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతూ ప్రజల సహనాన్ని పరీక్షిస్తోంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ కార్పొరేట్ కళాశాలల బస్సులతో ఈ ఫ్లైఓవర్ రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో భారీ వాహనాలు సాంకేతిక లోపంతో నిలిచిపోతే సమస్య వర్ణనాతీతం. మంగళవారం ఉదయం బస్సు కాంప్లెక్స్ నుంచి ఫ్లైఓవర్ ఎక్కే ప్రదేశంలో లోడ్ లారీ నిలిచిపోయి వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వాతావరణంపై రైతులకు అవగాహన



తాటిపర్తిలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై మండలంలోని తాటిపర్తిలో వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏడీఏ నల్లి దైవకుమార్ మాట్లాడుతూ పంట నమోదుకు ఈకేవైసీ పూర్తయిందని తుది జాబితా సచివాలయం, రైతు సేవ కేంద్రాల వద్ద అందుబాటులో ఉందని తెలియజేశారు. పంట నమోదు చేయించుకున్న రైతులు తమ ధాన్యాన్ని నవంబర్ పదో తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల వద్ద విక్రయించుకోవచ్చునని తెలిపారు. రైతులు మద్దతు ధర పొందేందుకు కనీస నాణ్యత ప్రమాణాలతో ఉండి, తేమ శాతం 17కు దిగువన ఉండాలన్నారు. పశువులను పెంచుకునేందుకు పశు వైద్యాధికారి మస్తాన్ సూచనలు, సలహాలు అందజేశారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రసాద్, ఉద్యానవన సహాయకులు సీహెచ్ మధు, గోపి, గోపు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ సమస్యల పరిష్కారానికి శిబిరాలు



సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో ఐరిస్ తీస్తున్న సిబ్బంది

సామర్లకోట: ఆధార్ కార్డుల సమస్యల పరిష్కారానికి మండల పరిధిలో శిబిరాలను ప్రారంభించినట్టు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. మంగళవారం పనసపాడు, అచ్చంపేట పంచాయతీల పరిధిలో ఆధార్ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ శిబిరాలు జరుగుతాయని ఆమె తెలిపారు. పీబీ దేవం గ్రామంలో నిర్వహించవలసిన ఆధార్ శిబిరానికి కిట్లు రాకపోవడం వల్ల అక్కడ ప్రక్రియ వాయిదా వేశారు. ఆధార్‌కార్డులో పేరు మార్పులు, పుట్టిన తేదీ, చిరునామా వంటి మార్పులతో పాటు ఆధార్ కార్డులు తీసుకుని 10 ఏళ్లు దాటిన వారు తప్పని సరిగా ఆధార్ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కాగా పేరు, పుట్టిన తేదీ, చిరునామాల మార్పులకు సంబంధించి ఆధారాలు ఉండాలని సూచించారు. పిల్లలకు ఆధార్ కార్డులు లేక పోవడం వల్ల అంగన్‌వాడీ కేంద్రాలల్లో ఇబ్బందులు ఏర్పడటంతో వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. అలాగే చదువుకుంటున్న పిల్లలకు ఆధార్ కార్డు ప్రక్రియ జరుగుతోందన్నారు. బుధవారం జి.మేడపాడు, నవర, గొంచాల, 24న వేట్లపాలెం, చంద్రంపాలెం, పవర, 25న వేట్లపాలెం, వీకే రాయపురం, పి.వేమవరం గ్రామాల్లో ఈ శిబిరాలు జరుగుతాయని వివరించారు. మిగిలిన గ్రామాల్లో రెండవ విడతలో ఏర్పాటు చేయనున్నట్టు ఆమె తెలిపారు.

రామకృష్ణ సేవలు ఆదర్శం



రామకృష్ణ దంపతులను సత్కరించిన రైల్వే మేనేజర్ తదితరులు

సామర్లకోట: రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామకృష్ణ సేవలను ప్రతి ఉద్యోగి ఆదర్శంగా తీసుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. 34 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు చేసి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేసిన ఆయనకు మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ గౌరవ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు, రైల్వే సూపరింటెండెంట్ అనంత లక్ష్మీ, వివిధ డిపార్టుమెంట్ల ఉద్యోగులు పాల్గొన్ని రామకృష్ణ దంపతులను సత్కరించారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం..!



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో గోతిలో నిలిచిపోయిన వర్షపు నీరు



కొత్తపల్లి-పండూరు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గోతులు

- ప్రమాదాలకు నిలయంగా రహదారులు
- వానొస్తే గొయ్యేదో.. రోడ్డేదో తెలియని పరిస్థితి
- పయనించాలంటే భీతిల్లుతున్న ప్రజలు



ఉప్పాడ-పొన్నాడ రోడ్డులో ప్రమాదకరంగా గుంతలు

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో ప్రధాన రహదారి పరిస్థితి అడుగుకో గుంతలా తయారైంది. దీనికి తోడు భారీ వర్షాలకు గోతుల్లో నీళ్లు చేరి సమతలంగా కనిపిస్తూ గోతులు గుర్తించక వాహన చోదకులు ప్రమాదాలపాలవుతున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో లింకు రోడ్డు, తారురోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఇలా పిఠాపురం-ఉప్పాడ, కొత్తపల్లి-పండూరు. మూలపేట-నాగులపల్లి, యండపల్లి జంక్షన్-రమణక్కపేట, కొమరగిరి-పిఠాపురం, ఉప్పాడ-పొన్నాడ, ఉప్పాడ- కాకినాడ బీచ్ వెళ్లే రోడ్డు భారీగా గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలపై నిత్యం వెళ్లే ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. బాలింతలు, గర్భిణులు, వైద్యశాలలకు ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

కీలకమైన రోడ్లపై నిర్లక్ష్యం తగదు



ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు, కొత్తపల్లి-పండూరు రోడ్లు ఎంతో కీలకం. రహదారికి పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలి. లేని పక్షంలో పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. వర్షం పడితే గోతులన్నీ నీటితో నిండిపోతున్నాయి.

– యర్ర శ్రీనివాస్, కొత్తపల్లి

ప్రాణాంతకమే



కొమరగిరి-పిఠాపురం రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. రోడ్డు దుర్భరంగా ఉన్నా పట్టించుకునే వారు లేరు. వాహనాల్లో వెళ్లేవారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రజాప్రతినిధులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలి.

– సత్యనారాయణ, కొమరగిరి

పెద్దాపురం డివిజన్‌లో45 బాణసంచా దుకాణాలు



వేట్లపాలెంలో తాత్కాలిక బాణసంచా దుకాణాల స్థలాన్ని పరిశీలించిన జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి శ్రీహరిజగన్నాథ్

- వేట్లపాలెంలో దుకాణాల స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఏఎఫ్ఓ

సామర్లకోట: పెద్దాపురం డివిజన్ పరిధిలో 45 తాత్కలిక బాణసంచా తాత్కాలిక విక్రయ దుకాణాలకు అనుమతులు ఇస్తున్నట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఎం.శ్రీహరిజగన్నాథ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని వేట్లపాలెంలో ఏర్పాటు చేస్తున్న తాత్కలిక దుకాణాల ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అన్ని షాపులు ఒకే ప్రదేశంలో ఉండటం వలన ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెద్దాపురం మండల పరిధిలో మూడు, సామర్లకోట మండల పరిధిలో సామర్లకోట మండలంలో నాలుగు దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. వేట్లపాలెంలో 9, సామర్లకోటలో 12, పెద్దాపురంలో 23, రాయభూపాలపట్నంలో ఒక దుకాణానికి దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి చర్చించిన తరువాత అనుమతులు ఇస్తామని ఆయన తెలిపారు. బాణసంచా విక్రయాలు చేసే వ్యాపారులు అగ్నిమాపక పరికరాలతో పాటు ఇసుక, నీటిని షాపుల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించండి

ఎంపీడీఓ హిమమహేశ్వరి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమమహేశ్వరి

సామర్లకోట: గ్రామాల్లో సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టిపెట్టాలని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి సూచించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ప్రజల నుంచి సేకరించిన చెత్తను వేయడానికి డంపింగ్ యార్డుకు భూములను గుర్తించాలన్నారు. ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం కావాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు. అలాగే ప్రజల నుంచి పన్నుల వసూలుపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందిస్తే పన్నులు వెంటనే చెల్లిస్తారని తెలిపారు. ప్రతీ నెల ప్రజలతో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. గ్రామ సభల ద్వారా గ్రామం అభివృద్ధికి దాతలు విరాళాలు ఇచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. దీనిపై గ్రామ ప్రజలల్లో అవగాహన పెంచాలని సూచించారు. గ్రామ ప్రజలకు మంజూరైన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ లోపు పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. ఈఓ పీఆర్డీ భైరవమూర్తి, 18 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: సారా తరలిస్తుండగా ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన పెంకే హనుమంతు 10 లీటర్లు సారా తరలిస్తుండగా ముందుగా అందిన సమాచారంతో ఎస్సై వెంకటేష్ అరెస్టు చేశారు. సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రీ సర్వే.. రైతుల భూమికి హామీ

తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి



రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల స్వాధీనంలో ఉన్న భూమికి రీ సర్వే హామీగా ఉంటుందని తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతుల దస్తావేజులోను, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసి సమస్య పరిష్కరించనున్నట్టు తెలిపారు. భూములకు సంబంధించిన యదార్థ పరిస్థితులపై ప్రతి రైతు సహకరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభల్లో సాయంత్రం వరకు 27 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రెండు, తన ఖాతాకు మొబైల్ నంబరు టాగ్ చేయాలని మూడు, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం రెండు, సవరణలకు ఒకటి, రెండు పాస్ పుస్తకాలకు ఒకే పాస్ పుస్తకం ఇవ్వాలని ఒకటి, భూమి వర్గీకరణ తప్పుగా పడిందని ఒకటి, విస్తీర్ణం తగ్గిందని 17 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. బుధవారం వల్లూరు గ్రామంలో గ్రామ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు సీహెచ్ నరసింహమూర్తి, ఎ.సంజీవ్, భరత్, టి.సాయిరాం, వీఆర్వోలు కె.చంద్రబాబు, ఆర్.కొండలరావు పాల్గొన్నారు.

పట్టు కోల్పోతే భవిత అంధకారం

- ప్రమాదమని తెలిసినా ఫుట్‌పాత్ ప్రయాణాలు
- హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న విద్యార్థులు



ఫుట్‌పాత్‌పై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

సామర్లకోట: ప్రమాదం అని తెలిసినా విద్యార్థులు బస్సులలో వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. రాజమహేంద్రవరం ఏడీబీ రోడ్డులో ఉన్న కార్పొరేట్ కళాశాలలకు చేరుకోవడానికి విద్యార్థులు నిత్యం సామర్లకోట నుంచి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. తుని, అన్నవరం, పిఠాపురం, ప్రతిపాడు తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు సామర్లకోట చేరుకుంటారు. రైళ్లలో దిగిన విద్యార్థులలో కొంత మంది కళాశాల బస్సుల్లో ప్రయాణం చేస్తూ ఉండగా కొంతమంది ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తారు. రైల్వే స్టేషన్‌కు ఎదురుగానే బస్సు కాంప్లెక్స్ ఉండడంతో విద్యార్థులు ఆర్టీసీ బస్సులు అందుకుని కళాశాలలకు వెళ్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు అందరూ ఒకేసారి కలిసి ఒకే బస్సులో ఎక్కడానికి ప్రయత్నించడం వల్ల తోటి ప్రయాణికులకు సైతం ఇబ్బందిగా ఉంటోంది. బస్సు ఎక్కిన విద్యార్థులు ఫుట్‌పాత్‌పైనే నిలబడి ఫీట్స్ చేస్తుండడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదమూ పొంచి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు వాలు తిమ్మాపురానికి కళాశాల సమయాల్లో మరో బస్సును ఏర్పాటు చేశారు. అయితే ఆ బస్సులో విద్యార్థులు రాకపోకలు సాగించడం లేదు. అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ సమీపంలో ఉండడంతో తరుచూ పోలీసు సిబ్బంది వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా విద్యార్థులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ బస్సుల డోర్లు తీసి వేయడంతో ఫుట్‌పాత్‌లపై నుంచి వారు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులకు డోర్లు ఏర్పాటు చేస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల్లో అవగాహన పెంచాలనే తోటి ప్రయాణికులు, తల్లిదండ్రులు, సామాజికవాదులు కోరుతున్నారు.

పక్కనే ప్రమాదం.. అప్రమత్తం!



నీలమ్మ చెరువు వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ బోర్డు

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న బోరుకు చెందిన విద్యుత్తు మోటారు బోర్డు ప్రమాదకరంగా ఉన్నదని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విద్యుత్ ఎర్త్‌వైర్ వల్ల నీలమ్మ చెరువు ప్రాంతానికి చెందిన తల్లి, కుమారుడు చనిపోయిన నేపథ్యంలో ఎక్కడ ఏ విద్యుత్ వైరు కిందకు వేలాడుతున్నా ప్రజలు భయపడిపోతున్నారు. నీలమ్మ చెరువు వద్ద బోరు చెందిన బోర్డు ప్రమాదకరంగా ఉన్నదని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, 20వ వార్డు కౌన్సిలర్ చిట్టుమాని రాఘవులు పేర్కొన్నారు. ఈ బోర్డును సత్వరం మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రదేశంలో పిల్లలు ఆటలు ఆడుకునేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు వాపోతున్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య



అనసూరి నాగలక్ష్మి (ఫైల్)

పిఠాపురం: పట్టణంలో మంగళవారం వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివాహిత అనుసూరి నాగలక్ష్మి (28) పిఠాపురం గొల్లపేట హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదుట తన భర్త దుర్గాప్రసాద్, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా అప్పుడే ఇంటికి వచ్చిన భర్త ఆమెను చూసి మందలించాడు. భోజనం చేసి ఆటో నడుపుకొనేందుకు బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఆమె ఇంట్లో ఉరివేసుకుని మృతి చెంది ఉంది. దీంతో ఆమె బంధువులకు, పోలీసులకు అతడు సమాచారం అందించాడు. దీనిపై పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

పెద్దాపురం సినిమాలు

లలితా స్క్రీన్-1: మా నాన్న సూపర్ హీరో, విశ్వం
లలితా స్క్రీన్-2: దేవర పార్ట్-1
వీరభద్ర: వేట్టయన్ ది హంటర్
శోభా: ఇద్దరూ ఇద్దరే..

సామర్లకోట

అనుశ్రీ స్క్రీన్-1: దేవర పార్ట్-1
అనుశ్రీ స్క్రీన్-2: జనక అయితే గనక
విఘ్నేశ్వర: విశ్వం, వేట్టయన్ ది హంటర్

పిఠాపురం

వెంకటేశ్వర : జనక అయితే గనక
అన్నపూర్ణ : ఇద్దరూ ఇద్దరే..
సత్య : విశ్వం, వేట్టయన్ ది హంటర్
పూర్ణ : దేవర పార్ట్-1

ఉప్పాడలో..

శ్రీనివాస : దేవర పార్ట్-1